
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 10 ఆగస్టు 2024



అమ్మో బొమ్మ..!



కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకనర్హం అని శ్రీశ్రీ అన్నట్టుగా.. కొందరు ప్రజాప్రతినిధులు తమ ప్రచార పిచ్చికి ప్రతిదానినీ వినియోగించుకుంటున్నారు. ఇందులో పరాకాష్ట గత సీఎం వైఎస్ జగన్.. ఆయన ప్రచార పిచ్చి ఎక్కడికి వెళ్లిందంటే.. భూముల సరిహద్దులకు వేసే సర్వేరాళ్లపైన, రైతులకు ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకాలపైనా, ఆఖరికి ప్రభుత్వ పాఠశాలల్లో ఇచ్చే చిక్కీలపైన జగన్ ఫొటోలు వేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజముద్రతోనే పట్టాదారు పుస్తకాలను రైతులకు అందించేవారు. మరి జగన్ హయాంలో మాత్రం ఆయన ఫొటోలతో ఉన్న పాసుబుక్కులు అందించారు. దీనిపై అప్పట్లోనే పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. అనంతరం వైసీపీ ఓడిపోయింది. జగన్ దిగిపోయారు. చంద్రబాబు సీఎం అయ్యారు. ఇప్పుడు భూముల మధ్య సర్వేరాళ్లపైన, రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపైన ఉన్న జగన్ బొమ్మలను చూసి.. అందరూ అమ్మో బొమ్మ అంటూ ఆందోళన చెందుతున్నారు.



- 68వేల పట్టాదారు పాస్‌పుస్తకాలు..
- 3,11,006 సర్వేరాళ్లపైనా జగన్ బొమ్మ
- సర్వేరాళ్ల కోసం రూ.5 కోట్లు తగలేశారు
- తప్పులతడకగా మారిన రీసర్వే
- భూమి కొలతల్లో వ్యత్యాసాలు
- టైటలింగ్ యాక్ట్ రద్దుతో విరిగిన పీడ
- రాజముద్రతో మళ్లీ పట్టాదారు పాస్‌పుస్తకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): అందరి మాదిరి పరిపాలన చేస్తే తనకేం గుర్తింపు అనుకున్నారేమో గత సీఎం వైఎస్ జగన్.. రైతులు మొత్తుకున్నా పట్టాదారు పుస్తకాలపై తన బొమ్మ వేసుకుని సంతోషపడ్డారు. జగన్ నిర్వాకం వల్ల సర్వేరాళ్ల కోసమే జిల్లాలో రూ.5కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చయింది. ఇక మళ్లీ జగన్ బొమ్మలతో ముద్రించిన పాస్‌పుస్తకాలకూ ప్రజాధనం ఖర్చు చేశారు. అయితే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. జగన్ ఫొటోతో ఉన్న పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకుని రాజముద్రతో కూడుకున్న పాస్‌పుస్తకాలు ఇస్తామని వెల్లడించింది.

రీసర్వే పేరుతో..

జగన్ హయాంలో 2020 డిసెంబరులో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంతో భూముల రీసర్వే చేపట్టారు. దీనిని జిల్లాలో మూడు విడతలుగా చేపట్టారు. భూములు రీసర్వే చేసి హద్దురాళ్లు పాతి కొత్తగా పాస్‌పుస్తకాలు ఇస్తామని ప్రకటించారు. అత్యాధునిక టెక్నాలజీతో డ్రోన్లతో సర్వే చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అయితే మొదటివిడత సర్వే పూర్తయిన తరువాత రైతులకు తత్వం బోధపడింది. పూర్వీకుల నుంచి అనాదిగా రికార్డుల్లో ఉన్న భూమికి రీసర్వేలో ఉన్న భూమికి ఎంతో వ్యత్యాసం ఉంది. చాలామంది రైతుల భూముల విస్తీర్ణం తగ్గిపోయాయి. పక్కనున్న భూముల్లోకి సర్వే కొలతలు తేడా వచ్చాయి. ఇది అప్పట్లో దుమారం రేగింది. ఘర్షణలు తలెత్తాయి. జిల్లాలో 20 లక్షల ఎకరాలకు పైగా ప్రభుత్వ ప్రైవేటు భూములున్నాయి. రీసర్వే పేరిట మూడు విడతల్లో 282 గ్రామాల్లో 4,56,277.40 ఎకరాల భూమిని సర్వే చేశారు. 2023 చివరి నాటికే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక సర్వే చేసిన తరువాత సరిహద్దు రాళ్లను జగన్ ఫొటోలతో ఉన్న వాటిని నాటడం చూసి ఔరా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

- మొదటి విడతలో కడప రెవెన్యూ డివిజన్‌లో 29 గ్రామాల్లో 17,768.85 ఎకరాలు, జమ్మలమడుగులో 18 గ్రామాల్లో 34,507.10 ఎకరాలు, బద్వేలులో 19 గ్రామాల్లో 16,415.45 ఎకరాలు, పులివెందులలో 20 గ్రామాల్లో 29,787.43 ఎకరాలు కలిపి.. తొలివిడత మొత్తం 98,478.83 ఎకరాలు రీసర్వే చేశారు.
- ఇక రెండో విడతలో కడపలో 26 గ్రామాల్లో 32,718.91 ఎకరాలు, జమ్మలమడుగులో 41 గ్రామాల్లో 68,957.71 ఎకరాలు, బద్వేలులో 25 గ్రామాల్లో 20,064.14, పులివెందులలో 7 గ్రామాల్లో 10,701.64 ఎకరాలు సర్వే చేశారు. మొత్తం రెండో విడతలో 99 గ్రామాల్లో 1,32,442.40 ఎకరాలు సర్వేచేశారు.
- ఇక మూడో విడతలో కడపలో ఐదు గ్రామాల్లో 8,055.13 ఎకరాలు, జమ్మలమడుగులో 34 గ్రామాల్లో 85,390.35 ఎకరాలు, బద్వేలులో 39 గ్రామాల్లో 76,390.73 ఎకరాలు, పులివెందుల రెండు డివిజన్లలో 19 గ్రామాల్లో 55,519.96 ఎకరాలు సర్వే చేశారు. మూడోవిడతలో 97 గ్రామాల్లో 2,25,356 ఎకరాల్లో రీసర్వే చేశారు.
- ఇక మూడు విడతల్లో కలిసి వైఎస్ జగనన్న భూరక్ష పేరిట ఉన్న 3,11,006 సర్వేరాళ్లను భూముల్లో పాతారు. ఒక్కోరాయికి ప్రభుత్వం రూ.150 చెల్లించింది. ఈ రాళ్ల కోసమే రూ.4.50 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక కొన్ని చోట్లరైతులు ఈ రాళ్లను ఆటోల ద్వారా పొలాలకు తీసుకుపోవడం, రైతులే పొలాల్లో కూలీలతో పాతుకోవడం కలుపుకుంటే ఈ సర్వేరాళ్లకోసం రూ.5కోట్లకు పైగానే ఖర్చు పెట్టినట్లు లెక్క. ఈ సర్వే వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదు. ఉన్న భూముల్లోనే వ్యత్యాసాలు వచ్చాయి. వాటిని సరిచేసే నాథుడే లేకుండా పోయాడు.

జగన్ పత్రాలతో బొమ్మలు

సర్వేరాళ్లలో జగన్ ఫొటోలు పేర్లను అలా వదిలేస్తే.. పట్టాదారు పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మ వేసి రైతులకు అందించడమే తీవ్ర దుమారం రేపింది. ఉమ్మడి రాష్ట్రంలో కానీ, విభజిత రాష్ట్రంలోని చంద్రబాబు హయాంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేవారు. జగన్ మాత్రం తన ఫొటోతో ఉన్న పాస్‌పుస్తకాలు ఇవ్వడాన్ని చూసి రైతులే కాదు పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. 'రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలపై నీబొమ్మ ఏంటి జగన్? నీ ఆస్తులు ఏమైనా పంచావా, రైతులకు తాత ముత్తాల నుంచి వారసత్వంగా భూములు వచ్చాయి. ఫొటోలు వేసుకోవాలంటే రైతులకు చెందిన వారి తాత ముత్తాతల ఫొటోలో, తల్లిదండ్రుల ఫొటోలో వేసుకుంటారు కానీ.. జగన్ ఫొటోతో పుస్తకాలేంటి? ఇది ఏం సంప్రదాయం, నీ సొంత ఆస్తిని ఏమీ ఇవ్వలేదు కదా..' అంటూ నిరసన వ్యక్తం చేసినా తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లన్నట్లుగా జగన్ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లింది. రీసర్వే పేరిట జగన్ ఫొటోతో ఉన్న 63,152 పాస్‌పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. వీటిలో 62,613 కొత్తపాస్‌పుస్తకాలు రైతులకు ఇచ్చారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో మిగిలిన పాస్‌పుస్తకాలు పంపిణీ చేయకుండా నిలిపివేశారు. కాగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ల్యాండ్‌టైటలింగ్ యాక్ట్ రద్దుచేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం ల్యాండ్ టైటలింగ్‌యాక్టును రద్దు చేశారు. జగన్ బొమ్మతో ఉన్న పాస్‌పుస్తకాలు వెనక్కు తీసుకుని రాజముద్ర కలిగిన పీఆర్ కోడ్ కలిగిన పుస్తకాలు ఇస్తామని నిర్ణయం తీసుకున్నారు. పట్టాదారుపాస్‌పుస్తకాలు జగన్ బొమ్మ లేకుండా రానుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రచారం పిచ్చి పీక్‌కు వెళ్లడంతో ప్రజాధనం దుర్వినియోగం చేశారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాటిన సర్వేరాళ్లు



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

మద్యం పాలసీలో పారదర్శకత తప్పనిసరి

- యువత మత్తు బారిన పడకుండా చర్యలు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు9: జిల్లాలో మద్యం పాలసీలో పారదర్శకత పాటించేలా చర్యలు చేపట్టాలని, సారా తయారీ ఎక్కడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లాలో నవోదయం ఫేజ్-2.0 కార్యక్రమం కార్యాచరణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవోదయం ఫేజ్-2.0లో భాగంగా జిల్లాలో సారా కాచే వృత్తిలో ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన జీవన సదుపాయాలను, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా పాలసీని పక్కాగా అమలు చేయాలన్నారు. యువత గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారిలో చైతన్యం తీసుకురావడం కోసం జిల్లాలో అన్ని ఉన్నత విద్యాలయాల్లో నెలకు రెండు కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. యువత మత్తుకు బానిసలు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ వెంకటరాముడు, సూపరింటెండెంట్ శ్రీనివాస నాయుడు, ఎక్సైజ్ ఎస్‌ఐ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలి

నిర్దేశిత గడువు లోగా గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించడానికి ప్రతిఒక్కరూ పని చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఉపయోగించుకోండి

- డీసీసీబీ సర్వసభ్య సమావేశంలో జేసీ అదితి సింగ్



డీసీసీబీ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అదితి సింగ్

కడప(రూరల్) ఆగస్టు 9: కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారులందరు మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఉపయోగించుకుని తద్వారా దేశంలోని ఏ బ్యాంకు ఖాతాకైనా నగదు బదిలీని వారి మొబైల్ నుంచే చేసుకోవచ్చునని బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బ్యాంకు సర్వసభ్య సమావేశంలో జేసీ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు సాధించిన ప్రగతి నివేదికను సమీక్షించిన అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులంతా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సహకార సంఘాలు కంప్యూటరీకరణకు అవసరమైన చర్యలు తీసుకుని సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని, ఈ విషయంలో సంఘ సీఈఓలు, డిపార్ట్‌మెంట్ అధికారులు, బ్యాంకు సూపర్‌వైజర్లు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంఘాల కంప్యూటరీకరణతో రైతులకు మెరుగైన సేవలు మరింత సులభతరం, పారదర్శకంగా అందించవచ్చన్నారు. బ్యాంకు సీఈఓ సి.రాజామణి మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.10.80 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలియజేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తక్కువ వడ్డీకి రుణాలు అందించడం ద్వారా ఉమ్మడి కడప జిల్లాలోని సహకార సంఘాలకు ఎరువుల వ్యాపారం, జన ఔషధి కేంద్రాలు, గోదాముల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, పెట్రోలు బంకులు తదితర వ్యాపారాలు చేసుకోవడానికి సహాయం చేస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జి జి.సుభాషిణి, బ్యాంకు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు అదుపులో ఉండాలి : ఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 9: పట్టణంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. శుక్రవారం ఆయన ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లో పర్యటించారు. అంతకు మునుపు పోలీస్ స్టేషన్లల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో చోరీలు జరుగకుండా గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. బంగారం అక్రమ రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదేశించారు. గంజాయి నిర్మూలనకు నిర్దేశించిన వంద రోజుల కార్యాచరణ అయలు చేయాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాబ్లింగ్ తదితర అసాంఘిక కార్యక్రలాపాలు జరుగకుండా నిఘా ఉండాలన్నారు. నూతనంగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహితపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బహిరంగ మద్యపానం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టణంలో సీసీటీవీ కెమెరాలపై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో ప్రతి రోజు పోలీసులు గ్రామాలను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలసుకోవాలన్నారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, రూరల్ సీఐ రమణారెడ్డి, టూటౌన్ సీఐ యుగంధర్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, రాజుపాలెం ఎస్‌ఐ తులసీరాంప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి అనుచరుడి ఇంట్లో కీలక పత్రాలు స్వాధీనం

- పరారీలో శశికాంత్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు



మదనపల్లె టౌన్, ఆగస్టు 9: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో గత నెల 21వ తేదీ రాత్రి ఫైళ్ల దహనం ఘటనపై మదనపల్లె వన్‌టౌన్‌లో అప్పటి ఆర్డీవో హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 15మంది అనుమానితులను విచారించిన పోలీసులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మదనపల్లెకు చెందిన శశికాంత్ హైదరాబాద్ నగరం మాదాపూర్‌లోని ఆర్‌ఆర్ రెసిడెన్సీలో నివశిస్తున్న ఇంట్లో గత నెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పోలీసులు సోదాలు నిర్వహించేందుకు వెళ్లారు. అక్కడ శశికాంత్ ఇంటికి తాళాలు వేసి వుండటంతో మరుసటి రోజు ఉదయం 10 గంటలకు శశికాంత్ ఇంటి పొరుగువారు, పెద్దమనుషుల సమక్షంలో పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కీలక మైన పత్రాలు, ఐ-ప్యాడ్, పెన్‌డ్రైవ్, యూకే వీసా, శశికాంత్ పాస్‌పోర్ట్, బ్యాంకు లావాదే వీలకు సంబంధించిన పత్రాలు, ఐటీ రిటర్న్స్, అప్పటి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికి చెందిన అసెంబ్లీ కార్‌పాస్, మదనపల్లెలో శశికాంత్ కొనుగోలు చేసిన భూలావాదేవిలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఏడు ఖాళీ ప్రామిసరినోట్స్, బ్యాంకుల స్టేట్‌మెంట్లు, భవన నిర్మాణాలకు సంబంధించి ఖర్చుల జాబితా, పీఎల్ఆర్ ప్రాజెక్టు వోచర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 136 వస్తువులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. దీనిపై శశికాంత్‌పై మదనపల్లె వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో గత నెల 29వ తేదీ ఏడు బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లె ప్రెస్‌మీట్‌లో తెలిపన వివరాల మేరకు మొత్తం ఎనిమిది కేసులు నమోదు కాగా అందులో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, వి.మాధవరెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, శశికాంత్ పోను మిగిలిన ముగ్గురు ఎవరనేది తెలియాల్సి వుంది. ఈ కేసు సీఐడీకి బదిలి అయిన నేపథ్యంలో పరారిలో వున్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తుండగా, కొందరు మదనపల్లె కోర్టులో, మరికొందరు రాష్ట్ర హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం అప్పీలు వేసినట్లు సమాచారం.

క్రీనీడలు

అది భావి క్రీడాకారులను తయారుచేసే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ). కడప నగర మునిసిపల్ మైదానంలో ఉన్న ఆ సంస్థలో హాకీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, స్కేటింగ్ తదితర క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఆ యా క్రీడలలో ప్రావీణ్యత సాధించాలనే ఔత్సాహిక క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు వీలుగా అక్కడ కోచ్‌లు అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ గత ఐదేళ్లుగా క్రీడల పురోగతి పట్ల డీఎస్‌ఏ దృష్టి సారించలేదనే ఆరోపణలున్నాయి. పైపెచ్చు అక్కడ వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు కూడా అంతంతమాత్రంగా ఉన్నాయని అంటున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో ఈ ఐదేళ్లలో క్రీడాకారులు క్రీడల్లో రాణించలేదనే విమర్శలున్నాయి.

- డీఎస్‌ఏలో.. సౌకర్యాలు అంతంత మాత్రమే
- వేతనాల వెతలతో కోచ్‌లు
- చోద్యం చూస్తున్న అధికారులు

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 9: క్రీడల్లో రాణించాలనే ఆసక్తి ఉన్నా మెరుగైన సదుపాయాలు లేకపోవడంతో కడప నుంచి మంచి క్రీడాకారులను డీఎస్‌ఏ అందించలేకపోతోందని సమాచారం. దీంతో పాటుగా కోచ్‌ల కొరత వేధిస్తోంది. వారికిచ్చే వేతనాలలో వ్యత్యాసాలున్నాయి. ఆ వేతనాలు కూడా సక్రమంగా రాకపోవడంతో శిక్షకులు ఒకింత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. మెరుగైన క్రీడాకారులను తయారుచేయడంలో మౌలిక వసతులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో కోచ్‌లకు కూడా అదేస్థాయి ప్రాధాన్యత ఉంటుంది. కోచ్‌ల పట్ల నిర్లక్ష్యం వహించడంతో క్రీడా అభివృద్ధికి ఆటంకంగా మారింది. డీఎస్‌ఏలో ఈ స్థాయి ఇబ్బందులున్నప్పటికీ సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం బాధాకరం.

పే అండ్ ప్లే విధానంతో క్రీడలకు గ్రహణం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టిన సంగతి తెలిసిందే. వాటిలో క్రీడా వ్యవస్థ కూడా అప్రతిష్ట పాలయింది. వివిధ క్రీడలలో ప్రావీణ్యం సాధించాలనుకునే ఔత్సాహిక క్రీడాకారుల జేబులకు చిల్లులు పడేలా వైసీపీ ప్రభుత్వం పే అండ్ ప్లే విధానం అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఇక్కడ ఎవరైనా శిక్షణ పొందాలంటే తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సిందే. ఇది పేద క్రీడాకారులకు భారంగా మారింది. కాస్త ఆర్థికంగా ఉన్న వారు మాత్రం డబ్బులు కట్టి శిక్షణ పొందేవారు. ఈ విధానం క్రీడలకు గ్రహణం పట్టేలా చేసిందనే విమర్శలున్నాయి. ఔత్సాహిక క్రీడాకారుల ద్వారా వసూలు చేసిన డబ్బులు అప్పట్లో డీఎస్‌ఏ చైర్మన్ ఖాతాల్లో జమయ్యేవని సమాచారం. అందులో నుంచి కోచ్‌లకు, డీఎస్‌ఏ సిబ్బందికి వేతనాలిస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఏదేనీ ఇతర అవసరాలకు, చిన్న చిన్న మరమ్మతులకు కూడా ఆ నిధుల నుంచి కొంతమేర వాడుకున్నట్లు సమాచారం.

డీఎస్‌ఏలో ఇదీ క్రీడల పరిస్థితి



డీఎస్‌ఏ స్టేడియం

కడప డీఎస్‌ఏ స్టేడియంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పాఠశాల, కళాశాలల స్థాయి క్రీడలు కూడా జరుపుకోలేని దుస్థితిలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటుగా క్రీడల మంత్రి దృష్టి సారించి క్రీడల పురోగతికి బాటలు వేయాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడలశాఖ మంత్రిగా ఉండడంతో క్రీడలకు తిరిగి పూర్వవైభవం దక్కుతుందనే జిల్లా క్రీడాకారులు ఆశాభావంతో ఉన్నారు.

సిద్ధమవుతున్న అన్నక్యాంటీన్లు

- 15 నుంచి ప్రారంభించేందుకు కసరత్తు
- నియోజకవర్గానికి మూడు క్యాంటీన్ల ఏర్పాటుపై దృష్టి
- శిథిలమైన క్యాంటీన్లను పునర్నిర్మిస్తున్న అధికారులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: అన్న క్యాంటీన్లు రూ.5లకే పట్టెడన్నం పెట్టి పేదల ఆకలి తీర్చిన అక్షయపాత్రలు. కేవలం రూ.15తో మూడుపూటలా కడుపు నింపే అన్నక్యాంటీన్లు గత వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపులకు బలయ్యాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేశారు. ఐదేళ్లపాటు అన్న క్యాంటీన్లకు పట్టిన గ్రహణం వీడిందని చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఐదు హామీల్లో ఒకటైన అన్నక్యాంటీన్ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈనెల 15 తేదీన వీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్నక్యాంటీన్లు ప్రారంభించింది. జిల్లాలో కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల్లో మొత్తం 8 క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. కడప నగరంలో 3, రాజంపేట, ప్రొద్దుటూరు, రాయచోటి, పులివెందుల, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రతిరోజూ వేలాది మంది పట్టణ పేదలకు రూ.5కే టిఫిన్, భోజనం లభించేది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం ఈ అన్నక్యాంటీన్లు ఆకలి తీర్చేవి. పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి కూడా మధ్యాహ్నం పూట అన్నక్యాంటీన్లలో రూ.5కే అన్నం లభించడంతో వారికి కూడా ఆర్థిక భారం తప్పేది. ఇలా ప్రతిరోజూ ఒక్కో అన్నక్యాంటీన్ నుంచి వందల సంఖ్యలో ప్రజల ఆకలి తీరేది. కడప నగరంలో పాతబస్టాండు, జడ్పీ కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో అన్నక్యాంటీన్లు ఆకలి తీర్చేవి.

నియోజకవర్గానికి మూడు..

వైసీపీ ప్రభుత్వంలో మూతవేసిన అన్నక్యాంటీన్లు అన్నింటినీ కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించింది. పాడైపోయిన భవనాలకు రంగులు వేసి మున్సిపల్ అధికారులు కొత్త రూపురేఖలు తెస్తున్నారు. శిధిలమైన వాటిని పునర్నిర్మిస్తున్నారు. జిల్లాలో ఒక్కో నియోజకవర్గం పరిధిలో మూడు అన్న క్యాంటీన్లు ఉండేలా చర్యలు చేపడుతోంది. ఆగస్టు 15 నుంచి వీటిని ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరగా స్థానిక అధికారులు ఆ మేరకు పంపారు. కడప నగరంలో మూడు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చాయి. అధికారులు కూడా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం

పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లను తాను కొనసాగిస్తానని తనతండ్రి పేరుతో వాటిని రాజన్న క్యాంటీన్లుగా నడుపుతానని చెప్పిన గత ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసివేశారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో రంగులు మార్చి అన్నక్యాంటీన్ల పేరును రాజన్న క్యాంటీన్లుగా మార్చి హడావుడి చేశారు. కడప నగరంలో కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని అన్నక్యాంటీన్‌ను వైసీపీ హయాంలో సచివాలయంగా మార్చారు. పాత రిమ్స్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను కూల్చేసి పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించారు. కొన్నింటిని అలానే వదిలేశారు. దీంతో పేదలకు పట్టెడన్నం కూడా లభించడం గగనమైంది. టీడీపీ నేతలు కొందరు తమ వ్యక్తిగత చొరవతో సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన వాటిని అక్కసుతో వైసీపీ నేతలు మూసేయించారు. పేదల నోటి దగ్గర కూడు లాగేశారని చెప్పాలి. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం తిరిగి అన్నక్యాంటీన్ల కొనసాగింపునకు చర్యలు ప్రారంభించింది.

కడప పాతబస్టాండు సమీపంలో మెరుగులు దిద్దుకుంటున్న అన్నక్యాంటీన్



26 మంది ఎంపీడీవోలు రిలీవ్

● ఉమ్మడి జిల్లాకు పూర్వ ఎంపీడీవోలు రాక

కడప(రూరల్) ఆగష్టు 9 : ఇటీవలన జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి కడప జిల్లాకు వచ్చిన 26 మంది ఎంపీడీవోలను శుక్రవారం రిలీవ్ చేశారు. ఇందులో 15 మంది ఎంపీడీవోలు కడప జిల్లా నుంచి రిలీవ్ కాగా మరో 11 మంది అన్నమయ్య జిల్లా నుంచి రిలీవ్ అయ్యారు. సదరు ఎంపీడీవోలను వారు ఉన్న జిల్లాలో ముందు పనిచేస్తున్న మండలాలకు తిరిగి పోస్టింగ్ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జడ్పీ సీఈవో మన్నూరు సుధాకర్‌రెడ్డి ఎంపీడీవోలను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● ఎన్నికల సమయంలో కడప జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలు

పేరు	మండలం	సొంత జిల్లా
బి.శివమల్లేశ్వరప్ప	బి. మఠం	కర్నూలు
ఎం.ఫజుల్ రహిమాన్	మైదుకూరు	కర్నూలు
పి.మధుసూధనరెడ్డి	కాశినాయన	కర్నూలు
ఎన్.ఉమామహేశ్వరరావు	సిద్దవటం	కర్నూలు
ఎస్.అమానులా	అట్లూరు	కర్నూలు
ఎస్.సుగుణశ్రీ	దువ్వూరు	కర్నూలు
వి.రజనీకాంత్	బద్వేలు	నెల్లూరు
కేవీ కోటేశ్వరరావు	కలసపాడు	నెల్లూరు
జీఎస్ రామచంద్ర	ఒంటిమిట్ట	అనంతపురం
కె.జోష్నా	లింగాల	అనంతపురం
ఎస్.షకీలా బేగం	సీకేదిన్నె	అనంతపురం
బి.విజయభాస్కర్	వల్లూరు	అనంతపురం
జి.లక్ష్మీనరసింహ	పెద్దముడియం	అనంతపురం
పి.దివాకర్	పులివెందుల	అనంతపురం
జె.సాల్మన్	సింహాద్రిపురం	అనంతపురం
అన్నమయ్య జిల్లాకు వచ్చిన అధికారులు....		
ఎ.అమర్‌నాధరెడ్డి	టి.సుండుపలె	చిత్తూరు
పి.సురేంద్రనాధ్	రాయచోటి	చిత్తూరు
నరసింహమూర్తి	పుల్లంపేట	అనంతపురం
పీడీ శ్రీనివాసులు	గాలివీడు	అనంతపురం
డి.ప్రభాకర్	రామాపురం	అనంతపురం
బి.రామకృష్ణ	చిన్నమండెం	అనంతపురం
పి.కుల్లాయి స్వామి	ఓబులవారిపల్లె	అనంతపురం
టి.యోగానందరెడ్డి	రాజంపేట	అనంతపురం
బి.నిర్మలా కుమారి	సంబేపలి	అనంతపురం
ఎ.వెంకటరంగారావు	చిట్వేలి	అనంతపురం
కేవీ సుబ్రమణ్యం	రైల్వేకోడూరు	కర్నూలు

జిల్లాకు పూర్వపు ఎంపీడీవోలు రాక

సాధారణ ఎన్నికల సమయంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారము ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు ఆయా జిల్లాల నుంచి శుక్రవారం రిలీవ్ అయ్యారు. వీరందరూ ఎన్నికలకు ముందు పనిచేస్తూ ఉండిన మండలాల్లో శనివారం తిరిగి ఎంపీడీవోలుగా బాధ్యతలను చేపట్టనున్నారు.

భూ వివాదంతోనే రామచంద్ర హత్య

ఏడుగురు నిందితుల అరెస్ట్, 3 బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం ● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



హత్య కేసులో పట్టుబడ్డ నిందితుల వివరాలు మీడియాకు తెలుపుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 9: భూ వివాదం కారణంగానే ఉసిరికాయల సిద్దలింగం కుమారుడు ఉసిరికాయల రామచంద్ర (45) హత్య జరిగిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కలకడ మండలం కదిరాయచెరువుకు చెందిన ఉసిరికాయల రామచంద్ర, కోటకొండ వెంకటేశ్ మధ్య గ్రామంలోని సర్వేనెంబర్ 262లో ఉన్న భూముల విషయంలో వివాదం ఉంది. 2023 మే నెల 1న ఈ భూమిలోని చెట్లను రామచంద్ర సోదరుడు శ్రీనాద్ ఎక్స్‌కవేటర్‌తో తొలగించి చదునుచేస్తూ ఉండగా వెంకటేశ్వర్లు అడ్డుకున్నాడు. అప్పట్లో ఇరువురు కలకడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంలో వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన రాంమోహన్ అలియాస్ మోహన్ మద్దతు తెలిపాడు. అప్పటి నుంచి శ్రీనాథ్‌తో పాటు అతని అన్న ఉసిరికాయల రామచంద్రపై వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. కాగా, తాను గతంలో హత్య చేసి జైలుకు వెళ్లి వచ్చానని వీళ్లను కూడా చంపేస్తానంటూ ఉసిరికాయల రామచంద్ర గ్రామస్తులతో చెప్పుండేవాడని ఎస్పీ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్, రాంమోహన్‌లు 24 రోజుల క్రితం పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన, ప్రస్తుతం మదనపల్లె టౌన్ నక్కలదిన్నెలో నివాసం ఉంటున్న వెంకట్రమణ కుమారుడు తుమ్మల నరేశ్‌తో ఉసిరికాయల రామచంద్రను చంపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకుగాను రూ.3.70 లక్షలు సుపారి మాట్లాడుకున్నారని వివరించారు. ఈ క్రమంలో జూలై 30 అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మదనపల్లె టౌన్ నక్కలదిన్నెకు చెందిన తుమ్మల సురేశ్, పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన పూజారి నరేశ్, మదనపల్లె టౌన్ నక్కల దిన్నెకు చెందిన సయ్యద్ బషీద్‌అలీ, షేక్. అష్రఫ్‌బాషా, పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన షేక్ మహమ్మద్‌జాఫర్ కలిసి కలకడ మండలం కదిరాయచెరువు గ్రామం వడ్లపల్లెకు సమీపంలోని పొలంలో రేకుల షెడ్డులో నిద్రిస్తున్న ఉసిరికాయల రామచంద్రపై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్య చేశారని వివరించారు. కలకడ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కేవీపల్లి ఎస్ఐ ఎస్‌కే రహీముల్లా, హెడ్ కానిస్టేబుల్స్ హరిబాబు, రమేశ్‌కుమార్, సునీల్‌శశికుమార్, రెడ్డిబాబు, నాగరాజు, కానిస్టేబుల్ యునస్, ఇమ్రాన్, రాంమోహన్, కరుణాకర్, రియాజ్, రమేశ్, యోగేశ్, లక్ష్మీనారాయణ, కేవీపల్లి పోలీస్ కానిస్టేబుల్స్ ధన, మోహన్‌కుమార్, హోంగార్డ్స్ సంజీవ, మురళి, రమేశ్‌లతో పాటు టెక్నికల్ వింగ్ రవి బృందం శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గుర్రంకొండ మండలం రాయచోటి-మదనపల్లె రోడ్డులోని కలకడ క్రాస్ వద్ద నిందితులను అరెస్టు చేసి వారి నుంచి హత్యకు ఉపయోగించిన రెండు రాడ్లతో పాటు మూడు ద్విచక్రవాహనాలను, ఆరు సెల్‌ఫోన్‌లు, రూ.17,080 నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్పీ వివరించారు. హత్య కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : ఆగస్టు 09: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 09, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శని, ఆది రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

శిక్షణను విజయవంతం చేయాలి

●12 నుంచి సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ ● జడ్పీ సీఈవో

కడప(రూరల్) ఆగస్టు 9: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సర్పంచులకు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణను విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్, జడ్పీ సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీలో శిక్షణ నిర్వహణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు ఆగస్టు 12 నుంచి 14 వరకు శిక్షణను నిర్వహిస్తున్నారన్నారు. 2024-25 వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఒక బ్యాచ్‌లో 40 నుంచి 50 మంది సభ్యులు ఉండాలన్నారు. ఎక్స్‌పర్ట్ రిసోర్స్ పర్సన్ చేత శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతి శిక్షణకు కోర్సు డైరెక్టర్, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్, ఈఓపీఆర్‌డీ ఉండాలన్నారు. ట్రైనింగ్ ప్రణాళికా ప్రకారం జరిగేలా ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణలో ఎల్‌సీడీ ప్రొజెక్టర్ విత్ స్క్రీన్, సౌండ్ సిస్టమ్, డెస్క్‌టాప్ కంప్యూటర్, వైట్ బోర్డు, భోజన వసతి, తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం-1994, పారిశుధ్య నిర్వహణ-గ్రామపంచాయతీల పాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల నిర్వహణ, స్ట్రీట్ లైట్ల వినియోగం తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకుగాను ప్రతి మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి పాటుపడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలు, ఏఓలు, ఈఓపీఆర్‌డీలుపాల్గొన్నారు.

నేడు గండిలో మొదటి శ్రావణ శనివారం

చక్రాయపేట, ఆగస్టు 9: గండి దేవస్థానంలో జరిగే శ్రావణ మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ ఏడాది గండికి భక్తులు భారీగా వస్తారని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు పూర్తిచేశారు. మంచినీరు, క్యూలు, డెకరేషన్లు, విద్యుత్ అలంకరణలు, షామియానాలు, కళాక్షేత్రం, ఔట్‌పోస్టు, వైద్య సదుపాయంతోపాటు తదితర అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పారిశుధ్యం కోసం టీటీడీ నుంచి 50 మంది సులభ్‌వారు వచ్చారు. పాపాఘ్ని నదిలో స్నానఘట్టాలు, షవర్లు ఏర్పాటు చేశారు. అలాగే దేవస్థానం ఆవరణలో విద్యుత్ అలంకరణలతో ప్రతిమలు ఏర్పాటు చేశారు. సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌తో పాటు వందమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం అంతా పూల అలంకరణలు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్‌లు పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లుచేశారు.

12 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు ఈ నెల 12 నుంచి ప్రారంభం అవుతాయని వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని పరీక్షలు వైవీయూ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి హాల్‌టికెట్లు తీసుకోవాలన్నారు. పరీక్ష టైం టేబుల్ కూడా అక్కడ లభిస్తుందని పరీక్ష ప్రారంభమయ్యే సమయానికంటే అర్ధగంట ముందే సెంట్రల్ లైబ్రరీ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

జూదరుల అరెస్ట్ : రూ.15,280 నగదు స్వాధీనం

సుండుపల్లె, ఆగస్టు9: జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో పేకాట ఆడుతుండగా దాడి చేసి రూ.15,280 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

నేడు అవుకు నుంచి
గండికోటకు కృష్ణాజలాలు



కొండాపురం, ఆగస్టు 9: నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి శనివారం గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలను విడుదల చేయనున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు అవుకు రిజర్వాయర్ వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కృష్ణమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కూడా పాల్గొంటారని ఎమ్మెల్యే పీఏ తెలిపారు. అవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా సుమారు 55 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం ద్వారా ఆదివారం ఉదయానికి కృష్ణాజలాలు గండికోట ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 1.44 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గండికోట ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

బంగారు వ్యాపారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 9 : విషగుళికలు తిని అశోక్‌కుమార్‌రెడ్డి (35) అనే బంగారు వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. అశోక్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులో బంగారు దుకాణం పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం నిహారిక అనే మహిళతో వివాహం అయింది. వీరికి కుమార్తె పుట్టింది. కొంత కాలంగా అతను ప్రతి విషయానికి కుటుంబ సభ్యులపై కోపం తెచ్చుకునేవాడు. రోజుల తరబడి అన్నం కూడా తినకుండా ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఈ నేపథ్యంలో భార్య నిహారికను పుట్టింటికి పంపాడు. గదిలో రాత్రి పడుకున్న అతను శుక్రవారం ఉదయం పొద్దుపోయినా లేవకపోవడంతో కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా నేలపై పడిపోయి కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకుపోగా అప్పటికే అతను చనిపోయాడు. మానసిక క్షోభతో అశోక్‌కుమార్‌రెడ్డి విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలియజేశారు.

ఉరివేసుకుని నాపరాయి కూలీ...

ఎర్రగుంట్ల, ఆగస్టు 9: ఎర్రగుంట్లలోని శాంతినగర్‌కు చెందిన వీరప్రతాప్(25) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాపరాయి కూలీగా పనిచేస్తున్న ఇతనికి తాగుడు అలవాటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో భార్యతో ఆయనకు మనస్పర్థలున్నాయి. ఆమె ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. గురువారం వీరప్రతాప్ అత్తగారింటికి వెళ్లి రాత్రికి తిరిగి వచ్చాడు. శుక్రవారం ఉదయం వీరప్రతాప్ ఇంటి వద్దకు అతని అన్న వెళ్లి చూడగా అప్పటికే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



రామాపురం, ఆగస్టు9: మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వంక వద్ద శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాద్ తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: ఢిల్లీ ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థి ఎన్.అశోక్ ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కానున్నారు. ఈ వేడుకలకు కేంద్ర యువజన సర్వీసులు క్రీడామంత్రిత్వశాఖ నుంచి విద్యార్థికి ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, ఎన్ఎస్ఎస్ పీఓ శివరామక్రిష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ లీలావర్ధిని విద్యార్థిని అభినందించారు.

ఆలయ సేవా ట్రస్టు వద్ద రూ.2.03 కోట్ల నిధులు

నందలూరు, ఆగస్టు 9: సౌమ్యనాథస్వామి ఆలయ సమీపంలోని సౌమ్యనాథ సేవాట్రస్టు వారి నిధులు వివిధ బ్యాంకుల్లో రూ.2,03,50,735లు ఉన్నాయని ట్రస్టు చైర్మన్ యెద్దుల సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం బోర్డు సమావేశం నిర్వహించి ట్రస్టు ఆదాయ వ్యయాలు పరిశీలించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టుకు విరాళాలు అందజేసి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అన్నదానంతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కూడా ఈ సంవత్సరంలో చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ట్రస్టు ఆర్థిక అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమాన్ని విస్తృతం చేయడానికి చర్చించి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, కార్యదర్శి శైలేంద్రనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చు



భగత్‌సింగ్‌నగర్ పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది - వైవీయూలో వీసీ క్రిష్ణారెడ్డి

సికెదిన్నె, ఆగస్టు 9: చెట్లు పెంపకంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చని అటవీశాఖ అధికారులు విద్యార్థులకు తెలిపారు. 'అమ్మపేరిట ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా భగత్‌సింగ్‌నగర్ పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు పెంచడం ద్వారా మానవ మనుగడకు అవసరమైన ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుందని పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటి కార్యక్రమాల్లో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో భారీ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: ప్రభుత్వ కార్యక్రమాల ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా వైవీయూలో మొక్కల పెంపకం డ్రైవ్ ప్రారంభించింది. బాలుర వసతిగృహ పరిసరాల్లో వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ యూనివర్శిటీ క్యాంపస్ హరితవనంలా మార్చడానికి పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఒక సమష్టి కృషి ఈ కార్యక్రమమన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి మొక్కలు నాటే ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాలని ఎన్‌ఎస్ఎస్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, డీన్ ఏజీ దాము, పరీక్షల నియంత్రణ అధికారి ఎన్.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ వెంకట్రాముడు, వార్డెన్లు పాల్గొన్నారు.

ఇడుపులపాయలో ఉపాధ్యాయులు

వేంపల్లె, ఆగస్టు 9: ఇడుపులపాయ మారుతీనగర్, కుమ్మరాంపల్లె పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. అటవీశాఖ మేరీ లైఫ్ ప్లాంటింగ్ శుక్రవారం మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు కామేశ్వర్ రావు, ఫారెస్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరు వరకు చేపల వేట నిషేధం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 9: ఈ నెలాఖరు వరకు చేపల వేట నిషేధం అమలవుతుందని జిల్లాలోని జలాశయాల్లో చేపలు పట్టరాదని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శాంతి పేర్కొన్నారు. చేపలు గుడ్లు పెట్టే సమయంలో వేట సాగిస్తే వాటి అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడతాయని అందువల్ల జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధంలో ఉంటుందని ఆమె వివరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడిన సోమశిలలో చేపల మాఫియా అనే శీర్షికన వెలువడిన వార్తకు ఆమె స్పందిస్తూ చేపల వేటను పూర్తిగా అరికడతామని, ఎక్కడైనా చేపలు వేట కొనసాగిస్తే కేసులు పెట్టి చట్టపర చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే చైతన్య కుటుంబీకులు

కమలాపురం రూరల్, ఆగస్టు 9: కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నర్సింహారెడ్డి, యువ నేత లక్ష్మిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, దివ్యశ్రీ కుటుంబసభ్యులతో కలిసి తిరుమల వెంకన్న దర్శనం చేసుకున్నారు. శుక్రవారం తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉదయం వీఐపీ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి రావడం ఎంతో ఆనందకరంగా ఉందని పుత్తా కుటుంబసభ్యులు తెలిపారు.

కడపలో 'క్విట్ కార్పొరేట్ ఇండియా' నిరసన



అంబేడ్కర్ సర్కిల్‌లో అఖిలపక్ష కార్మిక, రైతు సంఘం నేతల ధర్నా

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 9: కడప నగరంలో అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం వామపక్ష కార్మిక రైతు సంఘాల నేతలు 'క్విట్ కార్పొరేట్ ఇండియా' నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ అంబానీ, ఆదానిలాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని క్విట్ ఇండియా టుడే సందర్భంగా నిరసన తెలిపారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయరంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు సుంకర రవి, సుబ్బరాయుడు, మల్లికార్జున, మహిళా సంఘం నాయకురాలు భాగ్యమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలక్రిష్ణయ్య, మనోహర్‌రెడ్డి, బాలచంద్రయ్య, రంగారెడ్డి, చిన్నసిద్దయ్య, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 9: కడప మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కడప నగర సమితి ఆధ్వర్యంలో కడప నగర మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర కార్యదర్శి తారకరామారావు, నగర అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, ఆప్కస్‌లో పనిచేస్తున్న కార్మికులు చనిపోతే మట్టి ఖర్చుల డబ్బు రూ2500 ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్ చంద్రన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కమిటీ నేతలు ఈశ్వరయ్య, జనార్దన్, వెంకటాద్రి, రాజేశ్, రాగమ్మ, రమణమ్మ, సాయమ్మ, లక్ష్మిదేవి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీమీలేయర్ ఎస్సీ, ఎస్టీలకు వర్తించదు

కలెక్టరుకు రాష్ట్ర మాలమహానాడు వినతి



కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: క్రీమీలేయరు అనే పద్ధతి ఓసీ, బీసీలకు వర్తిస్తుందని, ఎస్సీ ఎస్టీలకు వర్తించదని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జాకట విజయశేఖర్ అన్నారు. ఎస్సీవర్గీకరణ వ్యతిరేకతకు సంబంధించి కలెక్టర్ శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న ఏ వ్యవస్థ అయినా భారత రాజ్యాంగాన్ని అనుసరించి నడుచుకోవాలసిందేనన్నారు. ఎస్సీ ఎస్టీల్లో అంటరానితనం, కులవివక్ష జీవితకాలం వెంటాడుతోందన్నారు. దళితుల్లో ఏ స్థాయి ఉద్యోగులు, వ్యాపారులనైనా అగ్రవర్ణ వ్యవస్థ అవమానపరుస్తూ హేళన చేస్తూ ఉంటారని, కావున వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి సురేశ్, రాయలసీమ అధ్యక్షులు జ్యేష్టాది భాస్కర్, డేవిడ్, సత్యరాజ్, దీపక్, పోతుబోయిన చంద్ర పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదైన టీచర్లను సస్పెండ్ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: పూర్వపు ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ నేపథ్యంలో ఉపాధ్యాయుడిపై దాడి ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదైన నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జేడీ కార్యాలయం ఏడీ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు చెప్పకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారికి మద్దతుగా వచ్చిన సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి, రామక్రిష్ణ, నాగమునిరెడ్డి, శివకుమార్‌పై గత నెల 19న చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. విద్యాశాఖాధికారులు ఈ నెల 2న సుండుపల్లె ఎంఈఓను మాత్రమే సస్పెండ్ చేశారని, మిగతా నలుగురిపై ఎందుకు ప్రేమ చూపిస్తున్నారని ప్రశ్నించారు.

వల్లూరు తహసీల్దారుగా శ్రీవాణి



తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీవాణి

వల్లూరు, ఆగస్టు 9: తహసీల్దారుగా శ్రీవాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో అట్లూరు తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లిన ఆమె ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో వల్లూరు తహసీల్దారుగా బదిలీపై వచ్చారన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాలసిన రెవెన్యూ సంబంధించి ఎటువంటి విషయాలైనా త్వరగా పూర్తి చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు సుహాసిని, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంటు నాగస్వరం పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాను

వార్డు మెంబర్ మహేష్

వేంపల్లె, ఆగస్టు 9: విజయవాడలో రాజమండ్రికి చెందిన సూర్యఎంటర్ ప్రైజెస్ కంపెనీ ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నానని వేంపల్లె పంచాయతీ వార్డు మెంబర్ కొత్తూరు మహేష్ తెలిపారు. బీటెక్ చదివానని, భార్య పిల్లలతో విజయవాడలో ఉంటూ ప్రైవేటు కంపెనీ ద్వారా ఏపీ ఫైబర్‌నెట్‌కు పనిచేస్తున్నానని పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డికి తెలియజేశారు. ఈమేరకు శుక్రవారం వినతిపత్రం అందించారు. జీవనోపాధి కోసం ఉద్యోగం చేస్తున్నానని, ఇందులో ఎలాంటి రాజకీయాలకు సంబంధం లేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగం చేయడం రాజ్యాంగ విరుద్ధమైతే వార్డు మెంబర్ పదవిని వదులుకునేందుకు సిద్ధమని ఆ వినతి పత్రంలో ఈఓకు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, ఆగస్టు 9: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. మరమ్మత్తుల కారణంగా ఆర్.తుమ్మలపల్లె, రాయలాపురం, రచ్చుమర్రిపల్లె, ఉలిమెల్ల, కనంపల్లె, మోట్నూతలపల్లె, ఇ.కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చెన్నూరులో నేడు అంతరాయం

చెన్నూరు, ఆగస్టు 9: మండలంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రటనలో కోరారు.

నేడు లింగాలలో అంతరాయం

లింగాల, ఆగస్టు 9: అంబకపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు రైతులు సహకరించాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

పెండ్లిమర్రి, ఆగస్టు 9: పెండ్లిమర్రి ఎస్ఐగా జి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కడప నుంచి పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడీపై సమగ్ర విచారణ జరిపించాలి : టీడీపీ



డీఈకి వినతి పత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

పులివెందుల టౌన్, ఆగస్టు 9: పులివెందుల విద్యుత్ ఏడీ శ్రీకాంత్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, విద్యుత్ డీఈ శ్రీనివాసులుకు శుక్రవారం టీడీపీ నేతలు వినతిపత్రం అందించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లె సరస్వతి మైన్స్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ కిరణ్‌ను పులివెందుల మున్సిపల్ ఆఫీస్ సమీప సబ్‌స్టేషన్‌లో నియమించారన్నారు. అక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని అధికారికంగా పంపించారన్నారు. బినామీలకు కాంట్రాక్టులు ఇప్పించేవాడని ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. ఈ వ్యక్తిపై ఎన్నో ఆరోపణలున్నాయని పూర్తి విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి, జిలాన్, జగన్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు అన్యాయం చేయవద్దు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: ఇంజనీరింగ్ విద్యార్థులకు అన్యాయం చేయకుండా మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివశంకర్, గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని లేదంటే 19వేల మంది విద్యార్థులు మధ్యలోనే నిలిచిపోతారన్నారు. ఏఐఎస్ఎఫ్ నేతలు తేజ, అఖిరానంద్, చంద్ర, అరుణ్, మస్తాన్, రాజేశ్, విహార్ పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష అలంకారం



వాసవీ మాతకు అలంకరణ చేసిన ఆర్యవైశ్య మహిళలు

వేంపల్లె, ఆగస్టు 9: శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని వేంపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పసుపు, కుంకుమతో చీర అలంకారం చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్ర, మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ కిషోర్ తెలిపారు. శుక్రవారం ఉదయం అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బాడుగ గదుల టెండర్లలో అవినీతి

కడప (మారుతీనగర్), ఆగస్టు 9: కడప ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలం, బాడుగ రూముల టెండర్లలో అవినీతి చోటు చేసుకుందని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ బాషా, మహిళా విభాగం జిల్లా చైర్మన్ విమల, కార్యదర్శి దివ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. లంచం ఇచ్చిన వారికి, అధికారులకు నచ్చిన వారికి ఎలాంటి నిబంధనలు లేకుండా ఖాళీ స్థలం టెండర్లు పిలిచి వారికి బాడుగ రూములు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల నిర్లయం వల్ల ఎన్నో కుటుంబాలు బలవుతున్నాయన్నారు. టెండరులో పాల్గొన్న పేద ఎస్సీ మహిళ స్రవంతి సమస్యను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్రవంతికి న్యాయం చేయాలని మంత్రి ఆర్టీసీ అధికారులను ఆదేశించారన్నారు. ఉన్నతాధికారులు న్యాయవిచారణ చేసి బాధితురాలికి అండగా ఉండాలని తెలిపారు.

క్విట్ ఇండియా ఉద్యమం చారిత్రక ఘట్టం

వేంపల్లె, ఆగస్టు 9: భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం ఒకచారిత్రక ఘట్టమని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నేతలు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి క్విట్ ఇండియా 82వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ పిలుపు మేరకు 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా అంటూ లక్షలాది మంది కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు నినాదాలతో రోడ్లపైకి వచ్చారన్నారు. కాంగ్రెస్ నేతలు ధ్రువ, సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్, రాజా, వేమయ్య, రవి, బద్రి, మదార్, వెంకటేష్, మాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నుంచి ఇద్దరు సీఐలు బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 9: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప సైబర్ క్రైంలో పనిచేస్తున్న శ్రీధర్‌నాయుడును చిత్తూరు వెస్ట్‌సర్కిల్‌కు, కడప సీసీఎస్‌లో పనిచేస్తున్న రాంభూపాల్‌ను పుంగనూరు రూరల్ సర్కిల్ చౌడేపల్లికి బదిలీ చేశారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ మహోత్సవం

వల్లూరు, ఆగస్టు 9: తప్పెట్లలో నూతన రామాలయా ప్రతిష్ఠ మహోత్సవాలు మొదటి రోజు శుక్రవారం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఉదయాన్నే గణపతిపూజ, ఆరాధన అనంతరం సీతారామ సమేత కోదండ రామస్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం యంత్రాలకు రుద్రాభిషేకం చేసిన తరవాత తీర్థ ప్రసాదాన్ని భక్తులకు అందించారు.

బాధ్యతలు చేపట్టిన వీఎన్‌పల్లె ఎస్ఐ



వీరపునాయునిపల్లె, ఆగస్టు 9: ప్రొద్దుటూరు వన్‌టౌన్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ మంజునాథ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా జీవనం గడిపేలా చూస్తామని, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

ప్రొద్దుటూరు నుంచి బెంగళూరుకు ట్రైన్ ఏర్పాటు చేయండి : ఎంపీ

పులివెందుల, ఆగస్టు 9: ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి, గుత్తి జక్షన్ మీదుగా బెంగుళూరుకు కొత్తరైలును ప్రారంభించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కడప ఎంపీవైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలోని కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నంద్యాల జంక్షన్ నుంచి మూడు ట్రైన్లు బెంగుళూరుకు వెళ్తున్నాయన్నారు. ట్రైన్ నెంబర్ 17211 కొండవీడు ట్రైన్ (మచిలీపట్నం నుంచి బెంగుళూరు) నంద్యాల, గుత్తిజక్షన్ ద్వారా బెంగుళూరుకు వెళ్తోందన్నారు. ఈ ట్రైన్‌ను నంద్యాల నుంచి బనగనాపల్లె, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి, గుత్తిజంక్షన్ మీదుగా బెంగుళూరు వెళ్లేలా చేస్తే చాలా మందికి ఉపయోకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట తిరుపతి ఎంపీ గురుమూర్తి ఉన్నారు.

వైభవంగా అంకాళమ్మ తల్లి ప్రతిష్ఠ

పులివెందుల టౌన్, ఆగస్టు 9: పెద్దరంగాపురంలో శ్రీఅంకాళమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగాయి. అమ్మవారి బింబ ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రజలు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. అలాగే బండలాగుడు పోటీలు పోటాపోటీగా సాగాయి. చౌటిపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు మొదటి, రెండవ బహుమతులు సాధించాయి. మూడు నుంచి తొమ్మిది వరకు వివిధ ప్రాంతీయులు విజేతలుగా నిలిచారు. ఎద్దుల యజమానులకు దాతలచే దేవస్థానంలో బహుమతులు అందించారు. దేవస్థానం తరపున అమ్మవారి వెండి బొమ్మను అందించారు.

మార్పు కోసం పుట్టిన పార్టీ జనసేన

కడప (మారుతీనగర్), ఆగస్టు 9: ప్రజల మార్పు కోసమే పుట్టిన ఏకైకపార్టీ జనసేన అని సుంకర శ్రీనివాస్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పవన్ కల్యాణ్ మంగళగిరిలో అర్జీలు తీసుకుంటున్న సంగతి తెలిసిందన్నారు. అందుకు వీలుగా మంగళగిరిలో నేతలను ఏర్పాటు చేసి తద్వారా వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ ఆదేశాల మేరకు జనసేన నేతలు రమణ, మాలే శివ ఆధ్వర్యంలో జనవాణి పోస్టర్లను ఆవిష్కరించారు.

చిన్నారులకు జ్వరాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 9: తూర్పుగండ్లూరు కాలనీకి చెందిన పలువురు చిన్నారులు జ్వరాలతో బాధపడుతున్నారు. కొద్దిరోజులుగా జ్వరం వస్తున్నా తగ్గకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తే వైద్యులు వారిని పరీక్షించారు. ఐదుగురు చిన్నారులు చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు. వారికి డెంగ్యూ సోకిందా అనేఅనుమానాలు తలెత్తుతున్నాయి. కాలనీల్లో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సింహాద్రిపురం, ఆగస్టు 9: జడ్పీ హైస్కూల్‌లో 2023-24 టెన్త్ ఫలితాల్లో మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన రాధికా, కాలిఫా, లోకేశ్వరికి రూ. 7వేలు, 5వేలు, 3వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎస్ఎస్‌సీ 1967-68 బ్యాచ్ విద్యార్థి సత్యప్రసాద్‌రెడ్డి ఆయన తల్లి పొన్నతోట గంగమ్మ జ్ఞాపకార్థం అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన సత్యప్రసాద్‌రెడ్డిని వక్తలు కొనియాడారు. మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, అరవిందనాథరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత టీచర్ గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా నాగపంచమి - మొక్కులు తీర్చుకున్న మహిళలు



కడపలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

కడప (కల్చరల్), ఆగస్టు 9: నాగుల పంచమి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మహిళలు పెద్దఎత్తున నాగులపుట్ట వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప నగర తహసీల్దారు కార్యాలయం వద్ద గల పుట్ట వద్దకు పలువురు మహిళలు పెద్దఎత్తున హాజరై అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహవీర్ సర్కిల్ వద్ద గల పుట్ట వద్ద కూడా మహిళా భక్తులు పెద్దఎత్తున హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగులపంచమి రోజున నాగదేవతను శరణు కోరితే మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

చెన్నూరులో...

చెన్నూరు, ఆగస్టు 9: స్త్రీలకు పుణ్యప్రదం మంగళ కారకాలు ఇచ్చే శ్రావణ మాసంలో వచ్చే నాగులచవితి, నాగపంచమికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. మహిళల కు ఈ మాసం అత్యంత భక్తిప్రదం కాబట్టి నాగపంచమి రోజు వల్మీకం (పుట్ట) వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం నాగులచవితి సందర్భంగా ఉపవాస దీక్ష చేపట్టిన మహిళలు పుట్ట వద్ద చలిమిడి, నువ్వుల పిండి నైవేద్యం పెట్టి పాలు పోశారు. శుక్రవా రం నాగపంచమి సందర్భంగా పుట్ట వద్దకు వెళ్లి ఉపవాస దీక్ష విరమిస్తూ పుట్టల్లో నాగదేవత కు పాలు పోశారు. పుట్ట వద్ద పూజలు నిర్వహించడం, పుట్ట చుట్టూ దారాలు, కొత్త బట్టలు, వివిధ రకాల పూలు పండ్లతో పసుపు కుంకుమతో పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కు టుంబ సమేతంగా పుట్ట వద్ద ప్రదక్షిణలు చేశారు. నాగదేవతకు మొక్కులు చెల్లించారు.

వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9: యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. బీఎస్సీ రెండో సెమిస్టర్‌లో మన్వితారెడ్డి 9.75, గౌసబీ 9.17, సాజిదా రెహమానీ 9.08 జీపీఏ సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో మౌనిక 9, హర్ష 8.9, భారతి 8.7, 4వ సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో అనూష 8.5, నాగసుస్మిత 9.2, చాందబీ 8.8, ఎంఎస్‌సీఎస్‌లో అనూష 8.5, ఆయేషా 8.2, బీకాం కంప్యూటర్స్‌లో అతిఫాభాను 9.1, పూజిత 9 జీపీఏ సాధించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కరస్పాండెంట్, కళాశాల ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

లేపాక్షి విద్యార్థుల విజయకేతనం



లేపాక్షి కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9: వైవీయూ సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్‌లో రిజ్వానా 9.7, సుస్మిత 9.6, భార్గవి 9.3 జీపీఏ సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో ఫల్గుణ 9.6, నాగహాసిని 9.4, ఎంఎస్‌సీఎస్ 4వ సెమిస్టర్‌లో లక్ష్మీభారతి 8.8, గీతిక 8.4, ఎంపీసీఎస్‌లో తేజశ్విని 8.6, బీకాం కంప్యూటర్స్‌లో సుధీర్‌ఆచారి 8.6, చంద్రకళ 8.5 జీపీఏ సాధించారు. మంచి మార్కులుసాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎస్వీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9: సెమిస్టర్ ఫలితాల్లో యోగివేమన యూనివర్సిటీ స్థాయిలో ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ హరినారాయణ తెలిపారు. రెండో సెమిస్టర్ బీఎస్సీ ఆనర్స్ జువాలజీలో మంజులత, మాధవి, తేజశ్వని, బయోటెక్నాలజీలో జ్ఞానశ్రీ పదికి 10కి జీపీఏ సాధించారు. బీఎస్సీ జువాలజీలో తస్లీం, చందన, లక్ష్మీలాలస 9.75, శాంతి, ఆస్నా, సాత్విక 9.5, ప్రవీణ 9.75, స్నేహ తన్మయి 9.25, నిత్య, తేజశ్వని 9.17, బీబీఏలో అమీర్ బాష 9.15, గంగామహేశ్వరి 9.33, బీసీఏలో నూరి 9.42, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సుప్రజ 9.42, లక్ష్మీప్రసన్న 9, బీకాంలో హసీనా 9.5 జీపీఏ సాధించారు. 4వ సెమిస్టర్ బీఎస్సీలో షబానా 9.76, రెహానా 9.71, అనుష్క సామియా 9.55, ఎంఎస్‌సీఎస్‌లో రవికిరణ్ 7.76, బీకాంలో ధనశ్రీ 8.95, బీబీఏలో వినయ్ 8.66 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌టీడీ కళాశాల విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌టీడీ అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9: వైవీయూ సెమిస్టర్ ఫలితాల్లో రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. 2, 4 సెమిస్టర్ బీఎస్సీ ఆనర్స్ బయో టెక్నాలజీలో భూస్రా ఫిర్దోస్ 9.69, రోషన్, మైథిలి 9.51, సఫానా 9.5 జీపీఏ సాధించారు. బయోటెక్నాలజీ రెండో సెమిస్టర్‌లో సాజియా 9.75, సుస్మిత 9.5, సాహిన్ 9.25, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్‌లో నాగ సుమిత్ర 9.5, అనీషా అజుం, హరిత 9.25 జీపీఏ సాధించారు. 4వ సెమిస్టర్ బీకాంలో సుగుణకుమారి 8.98, యాస్మిన్ 8.95, రుబీనా 8.72 మార్కులు సాధించారు. రెండో సెమిస్టర్ బీకాం హానర్స్‌లో జబిన్ 9.5, సాహిన్, రిజ్వానాభాను 9.17 జీపీఏ సాధించారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

రైలు సౌకర్యం కల్పించండి

ప్రొద్దుటూరు, ఆగస్టు 9 రాయలసీమలోని అన్ని జిల్లాలకు కేంద్ర బిందువు లాంటి కడపనుంచి బెంగుళూరుకు ఇప్పటి వరకు ఎలాంటి రైలు సర్వీసులు లేవని ఇందువల్ల కడప జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కడప,తిరుపతి ఎంపీలు అవినాష్‌రెడ్డి గురుమూర్తి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ కు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో వున్న కేంద్ర రైల్వే శాఖమంత్రిని కలిసి కడప నుంచి బెంగళూరుకు రైలు ఏర్పాటు చేయాలని వారు వినతి పత్రం అందజేశారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రైల్వే మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పందుల స్వైర విహారం..!

ఎర్రగుంట్ల, ఆగస్టు 9: ఎర్రగుంట్లలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఊరంతా ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రధాన రోడ్లలో తిరుగుతూ ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట చీకటిలో ద్విచక్రవాహనదారులకు ప్రాణకంటకంగా మారాయి. దాదాపు అన్ని వీధుల్లో ఇటీవల భారీగా పెరిగిపోయాయి. క్రీడా మైదానాల్లో కూడా విచ్చలవిడిగా తిరుగుతుండటం గమనార్హం.

● **విచ్చలవిడిగా పందుల స్వైరవిహారం..:** ఎర్రగుంట్లలో పందులు గుంపులు,గుంపులుగా తిరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట ప్రధాన రోడ్లలో పడేసిన వ్యర్థ పదార్థాలు తినేందుకు వస్తున్నాయి. పదుల సంఖ్యలో ఒకే చోట ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. నాలుగురోడ్ల కూడలి, పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న రోడ్లపై ఆ వీధుల్లో వారు రాత్రి వ్యర్థపదార్థాలు భారీగా వేస్తున్నారు. దీంతో పందులు వాటిని కలియబెడుతూ రోడ్లపైకి తెస్తున్నాయి. దీని వల్ల ఆప్రాంతమంతా భరించరాని కంపుకొడుతోంది. సాయిబాబా గుడికివెళ్లే రస్తాలోని చెత్త కుండీల వద్ద గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. శాంతినగర్‌లో, వలసపల్లెరోడ్డులో దర్గా వీధిలో పందులు సంచరిస్తున్నాయి. వ్యర్థపదార్థాలను ఇళ్లవద్దకు తెస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇళ్లల్లోకి వస్తున్నాయని, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని మహిళలు పేర్కొంటున్నారు. న్యూ కాలనీలోని కొందరు మహిళలను ఇళ్లలోకి వెళ్లి కరచిన సందర్భాలు కూడా లేకపోలేదని



ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ పక్కనే గుంపులు, గుంపులుగా పందులున్న దృశ్యం, మహేశ్వరనగర్ దారిలో పందులు

అధికారులు స్పందించకపోతే వ్యాధులు కూడా ప్రబలుతాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

● **ప్రమాదాలకు కారకాలు..:** ప్రధాన రోడ్లపైకి పందులు సడన్‌గా వస్తుండటంతో వాహనచోదకులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పందులను ఢీకొని ద్విచక్రవాహన చోదకులు కిందపడి కాళ్లచేతులు విరిగిన సందర్భాలు లేకపోలేదు. కొందరు శాశ్వత వికలాంగులు గా మారిపోతున్నారు.

● **రెండురోజుల్లో చర్యలు తీసుకుంటాం**

ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. పందుల పెంపకం దారులకు నోటీసులు అనేక సార్లు ఇచ్చాం. రెండు రోజుల్లో వాటిని లారీలలో తరలించేందుకు కమిషనర్‌తో చర్చిస్తున్నాం. ఇకపై ఉపేక్షించం.

-మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

చాపాడు, ఆగస్టు 9: ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 12 నుంచి సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రంతులయ్య తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తున్నారు. సర్పంచులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని పది గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు ఈ నెల 12 నుంచి 14తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. శిక్షణ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో జరగనున్నట్లు వారు తెలిపారు.

పోరుమామిళ్ల..: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు స్త్రీశక్తిభవనంలో ఈ నెల 12 నుంచి 14 వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అలాగే శిక్షణ తరగతులకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు.

తాత్కాలిక కూరగాయల మార్కెట్ లీజు వేలం

ప్రొద్దుటూరు, ఆగస్టు 9 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన తాత్కాలిక కూరగాయల మార్కెట్ లీజు వేలం పాటలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ రఘునాథరెడ్డి, ఆర్‌వో శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించిన ఈ వేలం పాటలో 90 లక్షలతో పాటను ఆర్ఐ శివచరణ్‌రెడ్డి మొదలు పెట్టారు. భూమిరెడ్డి రామాంజనేయరెడ్డి అనే వ్యక్తి 90.20 లక్షలకు పాట పాడి లీజు వేలం దక్కించుకున్నారు. ఈ లీజు పాట ఖరారు అయిన తేదినుంచి మార్చి 31 2025 వరకు వుంటుందని కమిషనర్ తెలిపారు. సకాలంలో లీజు మొత్తం మున్సిపాలిటీ ఖజానాలో చెల్లించి ఉత్తర్వులు పొందవచ్చన్నారు.

నాలుగు నల్లచట్టాలు రద్దు చేయాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 9 :ట్రేడ్ యూనియన్ కార్మిక రైతు సంఘాల నాయకులు క్విట్ కార్పొరేట్ ఇండియా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాని, అంబానీలాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతు వ్యవసాయాన్ని కాపాడాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైరవ ప్రసాద్, లక్ష్మీదేవి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, మేరీ, దస్తగిరమ్మ, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఆఫీసును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ ఆగస్టు 9 : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీసును శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సబ్ రిజిస్టర్‌పై ఫిర్యాదు రావడంపై తనిఖీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో అవినీతికి తావు లేదని అలా చేయాలనుకుంటే ఇక్కడ కుదరదు అని వార్నింగ్ ఇచ్చారు. కాగా రిజిస్టర్ ఆఫీసు ఇరుకు సందులో ఉండటంపై మార్చాలనే అంశంపై కూడా ఎమ్మెల్యే సబ్‌రిజిస్టర్ మారుతీ ప్రసాద్‌తో చర్చించారు.అనంతరం పాత మున్సిపాలిటీ భవనాన్ని రిజిస్టర్ ఆఫీసుకు పరిశీలించారు.



ఏసీసీ సిమెంటు బాధిత రైతుల సమస్యలపై సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పక్కన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 9: జమ్మలమడుగులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం సాయంత్రం ఏసీసీ సిమెంటు పరిశ్రమ భూ బాధితులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మైలవరం మండలం వద్దిరాల గ్రామ శివార్లలో ఏసీసీ పరిశ్రమ భూ బాధితులు హాజరయ్యారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఏసీసీ సిమెంటు పరిశ్రమ భూబాధితులతో మాట్లాడారు. బాధితులు మాట్లాడుతూ ఏసీసీ పరిశ్రమ ఫ్యాక్టరీని నిర్మించాలని పరిశ్రమకు తీసుకున్న భూముల విషయంలో కానీ, ప్రస్తుతం మిగతా భూములను ఏసీసీ పరిశ్రమవారే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఏసీసీ పరిశ్రమకు దగ్గరలో ఉన్న రైతుల భూములను ఎకరా రూ.25 లక్షలతో రైతులకు కొనుగోలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీసీ సిమెంటు పరిశ్రమ బాదిత రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : జడ్జి భార్గవి

జమ్మలమడుగు, ఆగస్టు 9: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువులో కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం పాఠశాలను జడ్జి తనిఖీ చేశారు. అక్కడ పాఠశాలలోని గదులను పరిశీలించి తరగతి గదులు, వంటశాలలను పరిశీలించారు. మండల న్యాయశాఖాధికార సంస్థ చైర్మన్‌గా పాఠశాలలో తనిఖీ చేసి విద్యార్థులకు సదుపాయాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. అలాగే పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక దాడులు



ప్రొద్దుటూరు ,ఆగస్టు 9 : ప్రొద్దుటూరులో ప్లాస్టిక్ దుకాణాలపై మున్సిపల్ ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. శుక్రవారం స్థానిక కోనేటి కాల్వ వీధిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు పట్టుపడ్డాయి. దాదాపు వందల కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, శానిటరీ సెక్రటరీలు శ్రీనివాసులరెడ్డి, కరుణశ్రీ రామచంద్ర, శ్రీనివాస వర్మ, హుస్సేన్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కొందరు టీడీపీ నాయకులు ప్లాస్టిక్ రైడింగ్ జరుగుతున్న షాపుల వద్దకు వెళ్లి దుకాణ యజమానులకు మద్దతుగా అధికారులను ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకుల తీరుపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను అరికట్టే చర్యలను అడ్డుకోవడంపై టీడీపీ నాయకులు తీరును పలువురు తప్పుపడుతున్నారు.

భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

బద్వేలు, ఆగస్టు 9 : భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ కార్యకమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, పి.వి.రమణ, ఇమ్మానుయేల్, పెంచలయ్య, విజయమ్మ, నాయకులు ఖాదర్‌బాష, ఓబుళపతి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్‌పై అవగాహన సదస్సు

బి.కోడూరు, ఆగస్టు 9 : మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు ప్రతి నెలా 9వతేదీన వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగమణి,పీహెచ్ఎన్ పుష్పాంజలి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మండల పరిధిలోని గోవిందాయపల్లె జిల్లా పరిషత్ హైస్కూలులో కంటి వైద్యాధికారి హుసేనయ్య కంటివైద్యపరీక్షలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రగుంట్ల, ఆగస్టు 9: ఎర్రగుంట్ల మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్‌కుమార్ తెలిపారు. అలాగే లైన్ల మరమ్మతులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సంస్థకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోరుమామిళ్ల..: 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పోరుమామిళ్ల మిగతా సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ వెంకట మహేష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ప్రొద్దుటూరు..: ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా రెండో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు ప్రొద్దుటూరు పట్టణమంతా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శ్రీనివాసులల రెడ్డి ఓ ప్రకటన లో తెలిపారు. విద్యుత్ వినియెగ దారులు విద్యుత్ అంతరాయాన్ని పరిగణనలోకి తీసుకుని విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు ఉండదని అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామచంద్రయ్య ప్రకటన ద్వారా ప్రజలకు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లారీని ఢీకొన్న బస్సు

పలువురికి గాయాలు

ఎర్రగుంట్ల, ఆగస్టు 9: ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం సాయంత్రం బస్సు లారీని ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బస్సు లారీలు రెండూ కూడా ముద్దనూరు వైపునుంచి కడప వైపు వెళుతున్నాయి. ముందు వెళుతున్న లారీని వెనుకగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు పగిలి అందులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ నరేష్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయాలైన వారికి వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బద్వేలు అర్బన్‌సీఐగా రాజగోపాల్‌యాదవ్



బద్వేలుటౌన్, ఆగస్ట్ 9 : బద్వేలు అర్బన్ సీఐగా ఎం. రాజగోపాల్‌యాదవ్ శుక్రవారం బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్‌సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ యుగంధర్ బద్వేలు నుంచి బదిలీకాగా ఆయన స్థానంలో ఎం.రాజగోపాల్‌యాదవ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామన్నారు.

కొండాపురం ఎస్ఐగా విద్యాసాగర్



కొండాపురం, ఆగస్టు 9 : కొండాపురం ఎస్ఐగా విద్యాసాగర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గా పనిచేశారు.అనంతరం బదిలీ పై బ్రహ్మంగారిమఠం వెళ్లారు.అక్కడి నుంచి బదిలీపై కొండాపురం వచ్చారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దు

జమ్మలమడుగు, ఆగస్టు 9: యువత ప్రతి ఒక్కరు మత్తు, మాదకద్రవ్యాల వంటి వాటిజోలికి వెళ్లవద్దని జమ్మలమడుగు డీఎస్పీ హుస్సేన్‌పీరా సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అన్నపేరుతో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు, నాయకులు శివనారాయణ, తులసీశ్వర్‌యాదవ్, సుబహాన్ పాల్గొన్నారు.

జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 9: జిల్లా చేనేత అధ్యక్షుడిగా శిలివేరు వెంకటేశ్వర్లును నియామకం చేశారు. ఆ మేరకు జిల్లా బీజేపీ కార్యాలయంలో రాయలసీమ జోన్ కన్వీనర్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగుకు చెందిన చేనేత కార్మిక నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఊసువాండ్ల పాములేటి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పృథ్వీనారాయణ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9: బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అర్కటవేముల పృథ్వీనారాయణను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీనారాయణ మాట్లాడుతూ మోదీ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఘర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

బద్వేలు, ఆగస్టు 9 : కీటక జనిత వ్యాధులైన డయేరియా, మలేరియా వంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖాధికారి కె. నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు మున్సిపాలిటీలో జరుగుతున్న ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంల జిల్లా సహాయాధికారి వెంకటరెడ్డి, మలేరియా అధికారి రమేష్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు టి.నరసింహారెడ్డి, బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చండి

కలసపాడు, ఆగస్టు 9 : మండల కేంద్రంలోని కలసపాడులోని ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు పూడ్చాలంటూ ప్రజాసంఘాల నాయకులు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు. కలసపాడు - గిద్దలూరు ప్రధాన రహదారిపై మోకాలిలోతు గుంతలు కొన్ని నెలలుగా ఉన్నా పట్టించుకోలేదన్నారు. వర్షం వస్తే చాలు రోడ్డుపై నీరు నిలబడి గుంత ఏదో, రోడ్డు ఏదో కనిపించడంలేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, ఆవాజ్ మండల కమిటీ సభ్యులు హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కాశినాయన ఆగస్టు9: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, పీహెచ్ఎన్ శారద తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి హమీదాబేగం సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి మాధురి, సీహెచ్‌వో మురళీక్రిష్ణ, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రూ.30,680 స్వాధీనం

కొండాపురం, ఆగస్టు 9: మండలంలోని చౌటిపల్లె గ్రామం వద్ద శుక్రవారం ఆరుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు.కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ , ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఆరు గురి నుంచి రూ.30,680 స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.